క్లుప్తంగా

కనీస వేతనం అమలు చేయాలి

నారాయణపేట టౌన్ : పశుమిత్రులకు కనీసం వేతనం ప్రభుత్వం వెంటనే అమలు చేసి ఆదుకోవాలని సీఐటీయూ జిల్లా కన్వీనర్ బాల్‌రాం ఒక ప్రకటనలో ఆదివారం డిమాండ్ చేశారు. కనీసం వేతనం రూ. 26 వేల అందివ్వాలని, అప్పటివరకు పనికి తగ్గట్టు పారితోషికం అందించి న్యాయం చేయాలని అన్నారు.

22న వేడుకలు



మక్తల్: ఆంధ్రా, కర్ణాటక దళిత వర్గ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 22న ఉగాది పండుగ సందర్భంగా గోల్డెన్ జూబ్లీ వేడుకలు నిర్వహిస్తున్నామని, విజయవంతం చేయాలని నాయకుడు బాబు కొంకల్ అన్నారు. ఆదివారం మక్తల్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో కరియప్ప, బండారి ప్రమోద్, నారాయణ, రాములు తదితరులు పాల్గొన్నారు.

మినీస్టేడియం గేట్ ఓపెన్ చేయండి

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియానికి సంబంధించి కొత్తబస్టాండ్ వైపు ఉన్న గేట్ ఓపెన్ చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు. గేట్ మూసివేయడంతో లోపలికి వెళ్లేందుకు వీలు లేకుండా పోతోందని వాపోతున్నారు. మినీ స్టేడియానికి ప్రధానంగా నాలుగు గేట్లు ఉన్నాయని కొత్తబస్టాండ్ వద్ద ఉన్న గేట్ పక్కన వీధి వ్యాపారులు ఉండటంతో గేట్ మూసివేశారని అంటున్నారు. దీంతో సత్యనారాయణ చౌరస్తా, పాతబస్టాండ్ మీదుగా సివిల్‌లైన్ చేరుకొని స్టేడియంలోకి వెళ్లాల్సి వస్తోందని, కిలోమీటర్ల దూరం నడవాల్సిన పరిస్థితి తలెత్తుతోందని అంటున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

కొనసాగుతున్న ప్రచారం

నారాయణపేట టౌన్ : జిల్లా కేంద్రంలో తెలుగు దేశం పార్టీ ఇంటింటి ప్రచారం కొనసాగుతోంది. టీడీపీ హయాంలో చేపట్టిన సంక్షేమ పథకాలను గురించి వివరిస్తూ, పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ వినయ్‌మిత్ర యాదవ్ ఆధ్వర్యంలో ఆదివారం మున్సిపల్ పరిధిలోని 5,7,8,12,17 వార్డుల్లో ప్రజలకు కరపత్రాలను అందించారు. టీడీపీ నాయకులు గోపాల్‌యాదవ్, శివకుమార్, భాస్కర్‌రెడ్డి, అవుటి వీరన్న, సత్యనారాయణగౌడ్, బన్నయ్యస్వామి, కిష్టప్ప, బలిజ వీరన్న కార్యకర్తలు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి వీల్‌చైర్ బహూకరణ

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): రాష్ట్ర దివ్యాంగుల సమితి ఆధ్వర్యంలో దివ్యాంగుడికి వీల్‌చైర్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు నర్సింహా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న వివాహ ప్రోత్సాహక బహుమతులు దివ్యాంగులకు వెంటనే అందించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు యాదమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ గంజి రాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య, జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్‌యాదవ్, నాయకులు లక్ష్మయ్యగౌడ్, శేఖర్, రాజు పాల్గొన్నారు.

ఉగాది కవి సమ్మేళనం

స్టేషన్ మహబూబ్‌నగర్: పాలమూరు సాహితి, లుంబిని పాఠశాల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని లుంబిని పాఠశాలలో శ్రీశోభకృత్ నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని నిర్వహించిన ఉగాది కవి సమ్మేళనం, పురస్కారాల ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. కవి సమ్మేళనానికి ముఖ్య అతిథిగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొని మాట్లాడుతూ జిల్లా సాహిత్యపరంగా ముందు వరుసలో ఉందన్నారు. సమాజాన్ని సంస్కరింపజేసేదే కవిత్వమని, అలాంటి కవిత్వమే సమాజంలో నిలుస్తుందన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మానవతా విలువలు మృగ్యమైపోతున్నాయని, వాటిని సంరక్షించాల్సిన బాధ్యత కవులపై ఉందన్నారు. ప్రధాన వక్త, ప్రముఖ పరిశోధకులు డాక్టర్ భాస్కరయోగి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోనే మొదటిసారిగా 16ఏళ్లుగా ఉగాది కవి సమ్మేళనం నిర్వహించడం గొప్ప విషయమన్నారు. సమాజం కోసం రాసిన కవిత్వమే నిలుస్తుందన్నారు. అనంతరం కవులు వల్లభాపురం జనార్దన, పులి జమున లకు శ్రీశోభకృత్ ఉగాది పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో లుంబిని స్కూల్ డైరెక్టర్ కె.లక్ష్మణ్‌గౌడ్, పాలమూరు సాహితి అధ్యక్షుడు డాక్టర్ భీంపల్లి శ్రీకాంత్, మార్కెట్ చైర్మన్ రహెమాన్, వైస్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, కొండయ్య, ఎస్.విజయ్‌కుమార్, జగపతిరావు పాల్గొన్నారు.

మైసమ్మ ఆలయంలో పూజలు

నవాబుపేట: మండలంలోని మైసమ్మ ఆలయంలో ఆదివారం పెద్దఎత్తున జనం తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. బోనాల మొక్కులు, పూజలు తదితర వాటితో ఆలయ ఆవరణ అడవి మొత్తం జనంతో నిండిపోయింది.

అధ్వానంగా రహదారులు

• ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోని అధికారులు



గుంతలమయంగా మాగనూర్- వర్కూర్ బీటీ రోడ్డు



అధ్వానంగా మారిన వర్కూర్ - నెరడగం రోడ్డు

మాగనూర్: మండల పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా మారడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఆయా రహదారుల్లో భారీ వాహనాలు లోడ్‌తో నిత్యం తిరుగుతుండడంతో చాలాచోట్ల ధ్వంసమయి గుంతలు ఏర్పడ్డాయి. ఏళ్లుగా సమస్యతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. రోడ్లపై ప్రయాణికులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని వెళ్తున్నారు. ఆయా రహదారుల్లో పలు సంబర్భాల్లో ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయిన ఘటనలూ చోటుచేసుకున్నాయి. ప్రధానంగా మండలంలోని మాగనూర్ నుంచి వర్కూర్, నెరడగం, ఉజ్జేల్లి, వడ్వాట్ నుంచి కొల్పూర్, మందిపల్లి వరకు ఉన్న ప్రధాన రహదారుల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. బీటీ రోడ్లు వేసి ఏళ్లు గడిచిపోవడంతో పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఆయా దారుల్లో అవసరమైన మరమ్మతులు చేసి సమస్య పరిష్కరించాలని అధికారులకు ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ధ్వంసమైన రోడ్లకు కనీస మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

ఇబ్బందులు పడుతున్నాం



మండలంలోని చాలా గ్రామాలకు వెళ్లే దారులు ధ్వంసమయ్యాయి. భారీ వాహనాలు నిత్యం లోడ్‌తో వెళ్తుండడంతో చాలా చోట్ల గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ద్విచక్రవాహనదారులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి మరమ్మతు చేయించి సమస్య పరిష్కరించాలి. పనుల్లో నాణ్యత పాటించాలి.

– నరేందర్‌సాగర్, వడ్వాట్

మరమ్మతు చేపట్టాలి



మండలంలోని చాలా గ్రామాలకు వెళ్లే దారులు గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు పడుతున్నాం. పూర్తిగా ధ్వంసం అవ్వడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రాణాలు కోల్పోయిన ఘటనలూ ఉన్నాయి. దీంతో ప్రయాణికులు జంకుతున్నారు. అధికారులు ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

– యాకుబ్‌అలీ, కోఆప్షన్ మెంబర్, నెరడగం

పనులు ప్రారంభిస్తాం



మండలంలోని ఆయా గ్రామాల రోడ్లు ధ్వంసమైన మాట వాస్తవమే. అయితే కొన్ని రోడ్ల మరమ్మతులకు నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ కోసం పనులు ఆగాయి. పూర్తయిన వెంటనే మరమ్మతు పనులు ప్రారంభిస్తాం. ప్రయాణికులు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– విలోక్, పంచాయతీ రాజ్ ఏఈ, మాగనూర్

కుంగ్‌ఫూతో ఆత్మరక్షణ



పోటీలను తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

ధన్వాడ: కుంగ్‌ఫూతో ఆత్మరక్షణ పొందవచ్చని, ముఖ్యంగా అమ్మాయిలు నేర్చుకోవడం ఎంతో మేలు చేస్తుందని సీఐ శ్రీకాంత్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలో నిర్వహించిన కామన్ జిల్లా కుంగ్‌ఫూ చాంపియన్‌షిప్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మాస్టర్ గౌనీశ్రీనివాస్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. చాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన వారికి మెడల్స్, సర్టిఫికేట్స్ అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు సుధీర్‌కుమార్, గోవర్ధన్‌గౌడ్, మాధవి, ఎస్‌ఐ రమేష్, ఆయా పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం



ప్రిన్సిపాల్ అభిబిన్ నిషాబేగంను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మరికల్: మండలకేంద్రంలోని జ్యోతిరావు పూలే పాఠశాల వార్షికోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రిన్సిపాల్ అభిబిన్ నిషాబేగం మాట్లాడుతూ పేద విద్యార్థుల కోసం ప్రభుత్వం ఈ పాఠశాలను ఏర్పాటు చేసిందన్నారు. విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. అనంతరం ప్రిన్సిపాల్‌ను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.

మరమ్మతు చేయండి

మరికల్: మండల కేంద్రం నుంచి మాధవరానికి వచ్చే రోడ్డుకు మరమ్మతులు చేయాలని గ్రామస్తులు రఘుపతిరెడ్డి, రామయ్య, బాలస్వామిలు అన్నారు. ఆదివారం వారు విలేకర్లతో మాట్లాడుతూ అధిక లోడుతో టిప్పర్లు తిరుగుతుండడంతో గుంతలు ఏర్పడ్డాయని వాపోయారు. దీంతో రాత్రి సమయంలో మరికల్ నుంచి గ్రామానికి వస్తుండగా వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు జరుగుతున్నట్లు వారు ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సంబంధిత అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.

అధ్యక్షుడిగా సరాఫ్ నాగరాజు

నారాయణపేట: ముదిరాజ్ సంఘం నారాయణపేట జిల్లా అధ్యక్షుడిగా సరాఫ్ నాగరాజును నియమిస్తున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాశ్ ప్రకటించి, నియామక పత్రాన్ని అందజేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని చంద్ర గార్డెన్‌లో జరిగిన రాష్ట్ర మహాసభల్లో నారాయణపేట జిల్లా ముదిరాజ్ సంఘాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా సరాఫ్‌నాగరాజు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జిల్లా అధ్యక్షుడిగా నియమించిన బండప్రకాశ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. జిల్లలోని ముదిరాజ్‌ల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు. సంక్షేమం కోసం ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ సేవలందిస్తామన్నారు. ముదిరాజ్‌ల ఐక్యతకు కృషిచేస్తానని అన్నారు. సరాఫ్ నాగరాజు నియామకం పై ముదిరాజ్ నాయకులు నర్సింహులు నాయుడు, శ్రీను, వెంకటయ్య, చంద్రు, హన్మంతు, రాము, రామకృష్ణ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించండి



దీక్షలో కూర్చున్న నాయకులు, ప్రజలు

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించే వరకు నిరసన ఆగదని మండల జేఏసీ కోకన్వీనర్ వెంకట్రామిరెడ్డి అన్నారు. ఆదివారం గార్లపహాడ్ గేటు వద్ద ఏర్పాటు చేసిన రిలే దీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. గార్లపహాడ్‌ను మండలంగా ప్రకటించాలని, లేదంటే ఈ నిరసన కార్యక్రమాలను ఆపేదిలేదన్నారు. కోయిల్‌కొండ మండలంగా అతిపెద్ద మండలంగా 44గ్రామ పంచాయతీలుగా ఉందని, మరో మండలంగా గార్లపహాడ్‌ను ప్రకటిస్తే మరింత అభివృద్ధి జరిగే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వెంకటేష్, రవి, రాంపూర్, గార్లపహాడ్ గ్రామాల ప్రజలు రిలే దీక్షకు మద్దతు తెలిపారు.

ఆయుష్మాన్ భారత్‌తో ఉచిత వైద్యసేవలు



పథకం గురించి వివరిస్తున్న పృథ్వీ నాగలింగేశ్వర్

అమరచింత: తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ ప్రధాన మంత్రి ఆయుష్మాన్ భారత్ పథకంలో చేరి రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యసదుపాయాలు పొందవచ్చని సీఎస్సీ సెంటర్ నిర్వాహకులు పృథ్వీ నాగలింగేశ్వర్ తెలిపారు. పట్టణంలోని రజక వీధిలో రజక కులస్తులకు ఆదివారం ప్రధాన మంత్రి అయుష్మాన్ భారత్ పథకం ద్వారా కార్డు పొందేందుకు దరఖాస్తులను స్వీకరించారు. భారత ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న పథకానికి ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అన్ని చేతివృత్తుల వారితో పాటు తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతిఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రజక సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సత్యేందర్, డ్రైవర్ శ్రీనివాసులు, సవరన్న, శ్రీనివాసులు, చిన్న రాజ పాల్గొన్నారు.

రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలి

మరికల్: మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రెగ్యులర్ డాక్టర్‌ను నియమించాలని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరన్న ఆదివారం ఒక ప్రకటనలో అన్నారు. దేవరకద్ర నుంచి మరికల్‌కు బదిలీపై వచ్చిన డాక్టర్‌ను మాగనూర్‌కు పంపించి, తీలేర్‌లో విధులు నిర్వహిస్తున్న పల్లే డాక్టర్‌ను ప్రాథమిక ఆస్పత్రికి బదిలీ చేయడం వల్ల ఓపీ పేషెంట్లు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అదేవిధంగా సమయ పాలన పాటించక పోవడంతో గంటల తరబడి వేచి ఉండాల్సివస్తోందన్నారు. వెంటనే సమస్య పరిష్కరించాలన్నారు.

మిషన్ భగీరథ పైపుల లీకేజీ



రోడ్డుపై పారుతున్న నీరు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక 26వ వార్డు పరిధిలోని హబీబ్‌నగర్‌లో అక్బరీ మజీద్‌కు వెళ్లే దారిన మిషన్ భగీరథ పైపులైన్‌కు రెండుచోట్ల లీకేజీలు ఏర్పడ్డాయి. దీంతో కొన్ని రోజులుగా తాగునీరు నడిరోడ్డుపై ఏరులై పారుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో రోడ్డుపై వెళ్లే పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో మిషన్ భగీరథ పథకం ద్వారా సరఫరా చేసే తాగునీటిని వృథా చేయొద్దని సూచిస్తున్న మున్సిపల్ అధికారులు ఈ లీకేజీలను సరిచేయకపోవడం గమనార్హం. మరో వైపు రోజు విడిచి రోజు కేవలం అరగంట మాత్రమే తాగునీరు వదులుతుండటంతో సరిపోవడం లేదని కాలనీవాసులు వాపోతున్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని కోటకదిరలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఆదివారం సర్పంచ్ మల్లు రమ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మునీర్, మన్యంకొండ పాలక మండలి మాజీ సభ్యుడు రాజేందర్‌రెడ్డి, నాయకులు నర్సిములు, ఖదీర్, ఇమ్రాన్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

ఏవీఎన్ రెడ్డికి సన్మానం



ఎమ్మెల్సీగా గెలుపొందిన ఏవీఎన్ రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

మక్తల్ : ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా గెలుపొందిన ఏవీఎన్‌రెడ్డిని మక్తల్ తపస్, బీజేపీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనతో పలు విషయాలపై మాట్లాడారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు భీంరెడ్డి, రవీందర్, నర్సిరెడ్డి, నాగర్జున తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య చర్యలు శూన్యం



పాథర్చేడ్‌లో రహదారి పక్కన నిలిచిన మురుగు

నర్వ: మండలంలోని పాథర్చేడ్ డబుల్ రహదారి పక్కన మురుగు నిలిచి దుర్గంధం వెదజల్లుతోంది. దీంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. గుంత ఏర్పడి నీరు నిలవడంతో సమస్య తలెత్తుతోందని స్థానికులు వాపోతున్నారు. బస్సుల కోసం నిత్యం ఈ కూడలి వద్ద నిలిచేవారు ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని సమస్య పరిష్కరించాలని, అవసరమైన పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి



పరామర్శిస్తున్న కొండయ్య

మాగనూర్: మండలంలోని కొత్తపల్లిలో రెండురోజుల కిందట ఓ పార్టీకి చెందిన నాయకుడు అతడి అనుచరులు చేసిన దాడిలో గాయపడిన బీజేపీ సీనియర్ నాయకుడు సోమప్పతో పాటు ఇతర నాయకులను రాష్ట్ర నాయకుడు కొండయ్య ఆదివారం గ్రామానికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా మాగనూర్ ఎస్‌ఐ నరేందర్‌ను కలిసి దాడి చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో కూడా సదరు వ్యక్తి వల్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకున్నాయని అన్నారు. పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సోమశేఖర్‌గౌడ్, నాయకులు విద్యాసాగర్, జయానందరెడ్డి, కనకరాజ్, నారాయణ, తిమ్మప్ప, నర్సప్ప, శ్రీనివాసులు, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు నష్టపరిహారం చెల్లించాలి



మాట్లాడుతున్న వెంకటేష్

మక్తల్: రైతులు సాగు చేసిన పంటలు ఇటీవల కురిసిన అకాల వర్షానికి దెబ్బతిన్నాయని రైతు కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు కావాలి వెంకటేష్ అన్నారు. ఆదివారం మక్తల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నష్టపోయిన రైతులకు ప్రభుత్వాలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని అన్నారు. ఫసల్ బీమా యోజన పథకాన్ని రాష్ట్రంలో అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో కర్ని శ్రీనివాసులు, పాండు, తిరుపతి, చిన్నన్న, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు మానసికోల్లాసాన్ని పెంపొందిస్తాయి



బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి

ఊట్కూరు: క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఊట్కూరులో జై భీం క్రికెట్ టోర్నమెంట్ ముగింపు సందర్భంగా నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. క్రీడాస్ఫూర్తిని కలిగి ఉండాలని, పట్టుదలతో రాణించాలని సూచించారు. నిర్వాహకులు గౌతమ్, రాజుకుమార్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

'పేపర్ లీక్'పై భగ్గుమన్న కాంగ్రెస్



మక్తల్‌లో రాస్తారోకో చేస్తున్న నాయకులు



మద్దూర్‌లో..

మక్తల్: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారంపై కాంగ్రెస్ శ్రేణులు భగ్గుమన్నాయి. మంత్రి కేటీఆర్ వెంటనే రాజీనామా చేయాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి అన్నారు. కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం చేశారు. నాయకులు రవి, నర్సిములు తదితరులు పాల్గొన్నారు.

నర్వ: లీకేజీతో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరిని కఠినంగా శిక్షించాలని పార్టీ నియోజకవర్గ నాయకులు పోలీస్ చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల దిష్టిబొమ్మలను దహనం చేశారు. జిల్లా నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

మద్దూరు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ రఘుపతిరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు నర్సింహ, వైస్ ఎంపీపీ వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడు యజ్ఞేశ్వర్‌రెడ్డి, నాయకులు లింగం, రమేష్, ఇమ్రాన్, నరసింహులు, విద్యాసాగర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

సేవా పురస్కారాలు అందజేత



పురస్కారం అందుకున్న వారితో ఫౌండేషన్ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: శ్రీకరి ఫౌండేషన్ పాలమూరు ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రం టీచర్స్‌కాలనీలోని సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఉగాది పండుగను పురస్కరించుకొని పలు రంగాలకు చెందిన వారికి సేవా పురస్కారాలతో సత్కరించారు. శ్రీకరి ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ మెట్టుకాడి శ్యాంసుందర్ మాట్లాడుతూ తెలుగు రాష్ట్రాలకు చెందిన కళాకారులు, కవులు, సఫాయి కర్మచారులు, డాక్టర్లు, ఉపాధ్యాయులు, సంఘ సేవకులను సేవా పురస్కారాలతో సత్కరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి, డాక్టర్ ప్రణీత, సంధ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.